డైలీ సీరియల్

- తమిరిశ జానకి

"లక్షలు లక్షలు డబ్బుంది నాకు. ఉన్న ఇద్దరు కొడుకులూ వాళ్ల వాళ్ల భార్య పిల్లల్తో అమెరికాలో ఉన్నారు.... ఉన్న ఊళ్ళో ఈ లంకంత కొంపలో లింగూ లిటుకూమంటూ మిగిలింది నేనూ మా ఆవిడే కాదా! నేనా... ఇంక బతికినన్నాళ్ళూ బతకను. మహాఅయితే ఇంకో ముప్ఫయేళ్ళో నలభై ఏళ్ళో... అంతే కదా? బతికేది నేను.." ఓర్నీ! ఆశ చాలా తక్కువే పాపం. ఇప్పుడరవై అయిదేళ్ళ వయసు. ఇంకోముప్ఫయ్యేళ్ళో నలభై ఏళ్ళో ఆయుర్దాయంట, అది కూడా తక్కువే అన్నట్టు.... అంతేకదాట?....

అచ్చం మొగసూర్యకాంతంలాముటముటలాడిపోతూ గడగడ గొణుక్కున్నాడు కోదండ రామయ్య.

"ఆ... ఏంటంటావ్?..." కస్సుమన్నాడు వీరభద్రయ్య మొగఛాయాదేవిలా కళ్ళూ మూతీ తిప్పుతూ.

"అబ్బే! నేనేవన్నానూ?"

ఇద్దరూ పుట్టినప్పటినించీ ఆ ఊళ్ళో ఒకే వీధిలో ఇరుగుపొరుగున మర్రిచెట్టు ఊడల్లా పాతుకుపోయిన పరమవీర భయంకర మిత్రులు. సొంత ఊళ్ళో... సొంత ఇళ్ళల్లో ఉంటూ ఎవరి పొలాలు వాళ్ళు సేద్యం చేయించుకుంటూ ఎవరి సొంత కాలుమీద వాళ్ళ సొంతకాలేసుకుని దర్జాగా బతికేస్తున్నారు. కాలంతో పాటూ వొచ్చే మార్పులు వాళ్ళ ఇళ్ళల్లోనూ కనపడతాయి. పాత ఇళ్ళని పాత ఇళ్ళలాగే ఉంచుకోకుండా మార్పులు చేర్పులు చేసి కొత్త కొత్తగా కట్టుకున్నారు. నున్నగా జారే ఫ్లోరింగులూ, డైనింగ్ టేబుల్ సెట్లూ, ఫ్రిజ్‌లూ, వాషింగ్ మెషిన్లూ ఇంకా అవీ ఇవీ ఎన్నో కాకుండా... మోకాళ్ళ నెప్పులు తగలడ్డాక ముక్కడానికి బెడ్‌రూమ్‌కి ఎటాచ్డ్‌గా అబ్రహాం లింకన్లా కూచునేవీ కట్టించేసుకున్నారు.

"ఇంతకీ అసలు సంగతేంటంటే... నేను బతికినన్నాళ్ళూ వొచ్చేలా ఓ డైలీ సీరియల్‌కి ప్రొడ్యూసర్ని అవుదావనుకుంటున్నా..." మనసులో ఆలోచన బయటపెట్టాడు వీరభద్రయ్య.

"అంటే... అంటే... డైలీ సీరియల్ తీస్తావా?"

"తీయిస్తాను ఓ డైరెక్టర్ని పెట్టి".

"ఈ చిన్న ఊళ్ళో కూచుని పొలాలు పంటలూ చూసుకోడం తప్ప నాటకాలు తియ్యడాలూ సినిమాలు తియ్యడాలూలాంటివి మనకేం తెల్సూ?"

"అదంతా డైరెక్టరే చూసుకుంటాడుగా! డబ్బుంది నా దగ్గర, ఎంత ఖర్చయినా బ్యాక్‌పుట్ వెయ్యను"

నీ ఇంగ్లీషు దొంగలెత్తుకెళ్ళా...

"అదిగో! మళ్ళీ ఏదో సణుగుతున్నావు..."

"నీ ముందు సణిగి నేను సాధించేదేవుంది చెప్పు"

"చెప్పులేదు బూటూ లేదుగానీ... నేనూ నువ్వూ బతికున్నన్నాళ్ళూ గేరంటీగా డైలీ నీ ఇంటో నువ్వూ, నా ఇంటో నేనూ సీరియల్ చూసుకోవచ్చు"

"అయితే మంచి డైరెక్టర్ని వెతుక్కుంటావన్నమాట"

"ఎతుక్కునేదేవుంది నీ పిచ్చిగానీ... మనూళ్ళో జీళ్ళుచేసే ఎగస్పర్టు చిట్టిబాబు లేడూ?"

"ఉన్నాడనే అనుకుంటున్నాను... పోయాడా ఏవిటి కొంపతీసి? వాడిచేతి జీళ్ళు తినేయోగం లేదా మనకింక?"

"శుభవార్త చెప్తుంటే నా డైరెక్టర్ని చంపుతావేంటి? పి.పి. లా అడ్డుపడకు"

"సరే సరే... పి.పి అంటే ఏవిటో?"

"పానకంలో పుడక అనీ... జీళ్లపాకం అంతబాగా సాగదియ్యగల్గిన చిట్టిబాబు డైలీ సీరియల్ సాగదియ్యలేడా?"

"అదీ పాయింటే... అయితే మనూరి చిట్టిబాబు బతుకుపండినట్టే. ఆంధ్రరాష్ట్రంలో ఓ వెలుగు వెలిగిపోతాడు."

"ఆంధ్రరాష్ట్రం ఒక్కటే ఏం ఖర్మ... కొద్దిరోజులు పోగానే దాన్ని హిందీలోనూ, అరవంలోనూ కూడా మొదలెట్టించెయ్యనూ చిట్టిబాబు చేత!"

"మరి వాడికా భాషలు తెలియదు కదా?"

"నువ్వు మరీనూ? ఆ భాషల్లో వాడు పండితుడై పోవాలా ఏంటి? మధ్యాన్నవప్పుడు రేడియోలో హిందీ పాటలు పెడుతూనే ఉంటాడుగా వాడికొట్లో."

"ఔను..."

"మరింకనేం? అరవం సంగతంటావా? గట్టిగా అరుస్తూ డైరెక్షన్ చేసేస్తే చచ్చినట్టు అర్థవైపోతుందాళ్ళకి. అరవం అరవం అంటూనే అరుస్తారు కదా మరాళ్ళు..."

బట్టతల తడువుకుంటూ తలూపాడు కోదండరామయ్య.

ఇంటికెళ్ళగానే భార్యకి చెప్పాడీ వార్త. చేటంత మొహం చేసుకుని... కళ్ళు విప్పార్చుకుని... కప్పుకుని ఉన్న పవిట చెంగుతీసి వెనక్కి విసిరేసి హొయలు ఒలక పోస్తూ ఓరగా చూసింది, "నా పంట పండింది" అంది.

"వీరభద్రయ్య టి.వి. సీరియల్ తీస్తానంటే మధ్యన నీ పంట పండటవేవిటే?"

తల ఓ పక్కకి వొంచుకుని... సోఫాచేతి మీద కుడిచేతి చూపుడు వేలితో రాస్తూ ముద్దు ముద్దుగా అంది అనసూయమ్మ "నాకు ఓ రోలిమ్మని అడుగుతాను."

"ఆ.. ఆ... ఇస్తాడిస్తాడు రుబ్బురోలు..."

"అదే మరి... అందుకే అంటాను... ఏ విషయంలోనూ నాకు రిపోర్టు ఇవ్వకపోగా సణుగుతారు..."

"రిపోర్టు కాదే బాబూ సపోర్టు. ఈ మాట వాడాల్సినచోట ఆ మాటా, ఆ మాట వాడాల్సిన చోట ఈ మాటావాడుతూ ఎప్పుడూ కన్‌ఫ్యూజ్ అయిపోతావుకదే..."

"మిమ్మల్ని చేసుకున్న రోజే మొదలైంది లెండి ఆ కరఫ్యూ ఏదో నా బతుకులో"

"కర్ఫ్యూ కాదే బాబూ!"

"ఏదో ఓటిలెండి... అసలు ప్రతి మొగాడి విజయం వెనకాల ఓ ఆడది ఉంటుందంటారు... మరలాంటప్పుడు ఆడదానికి రిపోర్టుగా మొగాడుండొద్దా?"

"నీకు నేనేం సపోర్టు ఇవ్వగలనే? నీ వెయిట్ ఎనభై అయిదు కిలోలు, నా వెయిట్ నలభై అయిదు కిలోలు..."

"చాల్లెండి... ఎప్పుడు చూసినా నన్ను దిష్టి కొట్టటవే మీ పని"

ఫోన్ రింగవడంతో మరింకేమీ మాట్లాడకుండా ఫోనందుకున్నాడు కోదండరామయ్య.

"ఆ... నువ్వా అమ్మాయ్ పార్వతీ!..." ఇంకా ఆయన వాక్యం పూర్తి కానేలేదు. చటుక్కున వొచ్చి లటుక్కున ఆయన చేతిలోంచి రిసీవర్ లాక్కుంది అనసూయమ్మ.

"ఇదుగో... మరే... అమ్మాయ్... నేను నాల్రోజుల్లో బయల్దేరి మీ హైద్రాబాద్ వొచ్చి మీ ఇంట్లో కొన్నాళ్ళుండిపోతానే..."

కంగారు పడిపోతూ అట్నించి పార్వతి అరిచినంతపని చేసింది.

"ఏవిటే అమ్మా... మళ్ళీ నాన్నగారితో దెబ్బలాడావా? ఇలా అస్తమానం దెబ్బలాడు కుంటూ ఎన్నాళ్ళు కాపురం చేస్తావే? ఏకంగా విడాకులిచ్చేసి వొచ్చెయ్యవే. అప్పుడింక మాటిమాటికీ నిన్ను రిసీవ్ చేసుకోడానికి, మళ్ళీ తిరుగు ప్రయాణం అప్పుడు రైలెక్కించడానికి స్టేషన్‌కి రావక్కర్లేదు నేను. అసలే పెట్రోల్ ధర మళ్ళీ పెరిగింది. ఆటోవాళ్ళకి పోసేడబ్బుల్తో మేడలు కట్టచ్చని విసుక్కుంటారు మీ అల్లుడుగారు"

"ఓసినీ అసాధ్యపుమాటలూ నువ్వూనూ... నీ ఇంటికొస్తానన్నందుకు నా నలభై అయిదేళ్ళ కాపురంలో చిచ్చుపెడతావుటే? ఇంతకీ నేను చెప్పేది వింటావా అసలు? వీరభద్రం మావయ్య డైలీ సీరియల్ తీస్తున్నారు..."

"నిజవా?" పార్వతిగొంతులో సంబరం.

"యాక్టర్లు ఎవరెవరు?"

"ఏవండీ... యాక్టర్లెవరని అడుగుతోందండీ అమ్మాయి...."

లబలబలాడుతూ నెత్తికొట్టుకున్నాడు కోదండరామయ్య.

"చెప్పట్లేదే అమ్మాయ్! మీనాన్నకన్నీ రహస్యాలేగా? ఈ నలభైఅయిదేళ్ళ కాపరంలో ఏవన్నా చెప్పారు గనకనా? దాపుడు మనిషి. పొట్టకోసి చూస్తే... ఇన్నేళ్ళుగా నాతో చెప్పకుండా

ఆయన దాచుకున్న రహస్యాలెన్నో పుచ్చిపోయి ఉంటాయి ఆ పొట్టనిండా. అందుకోసవేగా రోజూ వాము ఉప్పూ నవలడాలూ..... సొంఠి పొడి కారప్పొడీ...."

"అమ్మా! ఫోను బిల్లు పెరిగిపోతోందే నీ సొంఠిపొడీ కారప్పొడుల్తో అసలు నేనెందుకు ఫోన్ చేశానో మర్చిపోయేలా చేశావు...."

"పోన్లే... నువ్వెందుకు చేశావో ఏమోగానీ నేను చెప్పేది విను. వీరభద్రం మావయ్య డైలీ సీరియల్ హైద్రాబాద్‌లోనే తియ్యాలి కదా అందుకని నేను నాల్రోజుల్లో బయల్దేరి మీ ఇంటికొస్తానన్నాను."

"ఆయన సీరియల్ తీస్తే నువ్వెందుకూ బయల్దేరడం? నాకర్థంకాలా?"

"మరీ చోద్యంగా మాట్లాడుతున్నావు కదే! రోజూ వెళ్ళి షూటింగ్ చూడద్దూ? షూటింగ్ చూడాలని ఎప్పటినించో కోరిక నాకు".

రోజూ ఇంట్లో స్వయంగా ఫైరింగ్ చేస్తుంటావు కదే... షూటింగ్ కొత్తేవిటి నీకు..? కోదండ రామయ్య నసుగుడు.

"పైగా... సీరియల్ తీసేది మనవాళ్ళే కాబట్టి.. నటించాలని ఎప్పటినించో నాకున్న కోరిక తీరేమార్గం ఇదే అనుకుంటున్నాను. అడిగితే నాకేదన్నా రోలివ్వకపోతారా?"

"రుబ్బురోలు కూడా ఇవ్వలేరు. మిక్సీల్లొచ్చేశాయమ్మా"

"చాల్లే! నువ్వూ మీ నాన్నలాగే మాటాడుతున్నావు" టక్కున ఫోన్ పెట్టేసి లోపలికెళ్ళి పోయింది అనసూయమ్మ.

"అసలదెందుకు ఫోన్ చేసిందో చెప్పనిచ్చావు కాదు. నీ గొడవే నీది కాని" కోదండ రామయ్య మాటలు గాల్లో కల్సిపోయాయి.

!+!+!+!

వీరభద్రయ్య కబురు చెయ్యగానే కాకిలావొచ్చి వాలాడు చిట్టిబాబు.

"ఏరా వొచ్చావా?"

"అయ్!"

"కూచో"

"అయ్! వొద్దులెండయ్య" చేతులు కట్టుకున్నాడు.

"అరే' కూచోమంటే!"

ఆ అరుపుకి టక్కున నిల్చున్నచోటే కూలబడ్డాడు.

"అక్కడకాదురా! ఇక్కడ కూచో" కుర్చీ చూపించాడు.

"వొద్దులెండయ్య"

"ఎర్రిబాగులోడివి. నీ గొప్పతనం నీకు తెలీదు. సరేగానీ... సినిమాలు చూస్తుంటావా?"

"అయ్!"

"టి.వి. చూస్తుంటావా?"

"ఎప్పుడైనా నండీ..."

"జీళ్ళు చెయ్యడంలో నువ్వు ఎగస్పర్టువి కదా! జీళ్ళపాకం నీకు బాగాతెల్సు. అందుకని నీ చేత... ఓ డైలీ సీరియల్‌నే బతికున్నన్నాళ్ళూ... వొచ్చేలా తీయిద్దావనుకుంటున్నాను"

"మీరింకెన్నాళ్ళు బతుకుతార్లెండి. ముసలాళ్ళయిపోలా?" చిట్టిబాబు కళ్ళు ఆశ్చర్యంగా చూస్తూ మూగగా అడిగాయి.

నోరుమాత్రం "అయ్యబాబూ నాకాడంత డబ్బెక్కడుందీ?" అంటూ దీర్ఘం తీసింది.

"నువ్వూరికే కంగారైపోకు, డబ్బు నాది, సాగుడు పాకం నీది, సరేనా?"

"అయితే రేపట్నించీ జీళ్ళ కొట్లో ఎవుర్ని కూచోపెట్టాలో?" ఆలోచిస్తున్నట్టుగా బుర్ర గోక్కున్నాడు.

"నన్ను కూచోపెట్టు" చివ్వున లేచాడు వీరభద్రయ్య.

"లేకపోతే ఏంటంట? ఇంక ఆ జీళ్ళ కొట్టు మూసెయ్యవా డైలీ సీరియల్ తీస్తున్నప్పుడు."

"ఔనయ్యా! తప్పయిపోయింది... మరి... మరి... సీరియల్‌కి కద కావాలి కదయ్యా! మీరు సెప్తారా కద?"

"కథ కూడా నేచెప్పాలా? ఇంకనువ్వు తీసేదేంటి? తెల్లారిలేచిందగ్గర్నుంచీ పడుకునే దాకా ఇరుగుమ్మకీ పొరుగుమ్మకీ ఊరూవాడా కహానీలు చెప్తాఉంటుందిగా మీయావిడ. ఓ కహానీ నువ్వూ చెప్పించుకో."

"ఆయ్! సిత్తం.. మరయ్యా.. మరి... మా సిన్నమ్మాయి సినేమా పాటలకి టెప్పులేసి బాగా ఆడుతుందయ్యా... దాన్ని హీరోయిన్‌గా పెడదావయ్యా!"

"ఎన్నేళ్ళు దానికి?"

"పన్నెండేనయ్యా..."

మరీ చిన్నపిల్ల కదా! వొద్దులే... ఎవరినన్నా కొత్తోళ్ళని బొంబాయి నించి తీసుకొద్దాం".

"అమ్మో! బొంబాయి పేరు సెప్తే బాంబులు కనపడతాయ్! ఆడికి పోయే దమ్ములు నాకులేవయ్యా".

"నువ్వు పోనక్కర్లేదు. నేనే పోయి ఏ పిల్లనైనా బొంబాయి నించి తీసుకొస్తా"

సరిగ్గా అప్పుడే చేతిలో గరిటతో రంగప్రవేశం చేసింది సావిత్రమ్మ.

"సిగ్గు లేకపోతేసరి.."

భార్యమాటలకి తెల్లబోయి చూశాడు వీరభద్రయ్య.

"ఇన్నేళ్ళొచ్చి... బొంబాయెళ్ళి పిల్లని తెచ్చుకుంటారా పిల్లని... అవ్వ... ఈ వయసులో..."

"నీకేవీ తెలియదూరుకో... అనుమానప్పక్షీ... నువ్వు లోపలికెళ్ళు..."

"అదిగో... పెళ్ళయినప్పట్నించీ ఇలా అంటూనే... నన్ను వంటింట్లోకి నెట్టేసి... నా వెనకెన్ని గ్రంథాలు నడిపారో ఏమో!"

"అంత భాగ్యం కూడానా ఈ బతుక్కి.... పనిమనిషొచ్చి పన్చేసి వెళ్ళేదాకా నా కళ్ళజోడు నా మొహాన్ని పెట్టవు కదా? నేను అగ్గినిప్పునంటే నమ్మవు. పొలానికెళ్ళినప్పుడల్లా ఎవడో ఓ బొట్టికాయిని నాకూడా పంపుతావు."

ఫోన్ మోగడంతో వంటింట్లో కెళ్ళిపోయింది సావిత్రమ్మ స్టవ్‌మీద పెట్టిన కూరగుర్తొచ్చి.

"నాన్న! బావున్నారా?" ఫోన్లో అట్నుంచి కొడుకుగొంతు విని.

"బావున్నాం" అంటూ జవాబిచ్చి పక్కకి తిరిగి చిట్టిబాబువైపు చూశాడు వీరభద్రయ్య.. " మా పెద్దబ్బాయి... అమెరికానించి..."

అమెరికా అయితే నాకేవిటి అమలాపురం అయితే నాకేవిటి అన్నట్టుగా చూశాడు చిట్టిబాబు నిర్వికారంగా.

"ఆ... ఆ... ఏవిటేవిటి... పర్మనెంటుగా ఇండియా కొచ్చేస్తున్నారా? ఇంక అమెరికా వెళ్ళరా? ఎందుకూ?... మీ ఇద్దరి ఉద్యోగాలూ ఊడిపోయి ఆర్నెల్లయిందా? మళ్ళీ ఇంకో ఉద్యోగం నీకూ దొరకలేదు తమ్ముడికీ దొరకలేదా? అక్కడా ఉద్యోగాలకి కష్టంగానే ఉందంటావా? సరే సరే! వొచ్చెయ్యండి... తప్పుతుందా? ఆ... ఏంటి? ఆస్తి పంపకాలు చెయ్యాలా?"

ఫోన్ పెట్టేసి నీరసంగా సోఫాలో వెనక్కివాలాడు వీరభద్రయ్య.

ఎదురుగా చిట్టిబాబు.

"ఏంటి చిట్టిబాబూ? ఏంటిలా వొచ్చావ్!"

"ఆయ్! మీరేకదయ్యా డైలీ సీరియల్..." నసిగాడు.

"ఇంకేం డైలీ సీరియలూ? సుపుత్రా కొంపపీకరా అనీ... కొడుకులిద్దరూ కొంప మీద కొస్తున్నారు... మా ఇల్లే ఓ డైలీ సీరియల్ అవుతుందింక... ఇంటికెళ్ళి నీపన్చూసుకో..." వీరభద్రయ్య కళ్ళముందు రియల్ సీరియలే కనపడుతోంది.

★☆★☆★